
సాక్షి
బాపట్ల
సోమవారం । 24 । మార్చి । 2025



కిక్కిరిసిన కార్తికేయుని ఆలయం

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం భక్తులతో ఆదివారం కిక్కిరిసింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద రద్దీ కనిపించింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం ఆదివారం 520.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.

అమ్మవారిని తాకిన సూర్యకిరణాలు



కోడూరు: భక్తుల ఇలవేల్పుగా పూజలు అందుకుంటున్న కోడూరు గంగాభవానీ అమ్మవారి మూలమూర్తిని ఆదివారం ఉదయం సూర్య కిరణాలు తాకాయి. ఉదయం 6.47 గంటల సమయంలో సూర్య కిరణాలు నేరుగా గర్భాలయంలోని అమ్మవారిపై పడ్డాయి.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమ)	సహర్ (మంగళ)
బాపట్ల	6.24	4.52
గుంటూరు	6.24	4.52
నరసరావుపేట	6.26	4.54

తీరంలో అక్రమాలు రీస్టార్ట్!

కూటమి అధికారంలోకి రాగానే బాపట్ల జిల్లా పచ్చ నేతలు తమ అక్రమాలు రీస్టార్ట్ చేశారు. జిల్లాలోని సముద్ర తీర ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములను పచ్చ నేతలు విక్రయానికి పెట్టి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. దీంతోపాటు అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు అందిన కాడికి దండుకొని మౌనంగా ఉంటున్నారు. రిసార్ట్‌ల పేరుతో స్థలాలు కొనుగోలు చేస్తున్న నేతలు పక్కనున్న ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఆక్రమిస్తున్నారు.

- అసైన్డ్ భూముల్లో అక్రమంగా రిసార్ట్‌లు
- సీఆర్‌జెడ్ నిబంధనలకు తిలోదకాలు
- తీర ప్రాంతాన్ని చెరబట్టిన పచ్చ నేతలు
- గెస్ట్‌హౌస్‌లూ నిర్మిస్తున్న అక్రమార్కులు
- మామూళ్ల మత్తులో అధికారులు
- ఇప్పటికే 40కిపైగా రిసార్ట్‌ల నిర్మాణం
- నిర్మాణంలో మరో 35 రిసార్ట్‌లు
- ఎన్నికలకు ముందు ఆర్డీవో నోటీసులు
- కూటమి అధికారంలోకి రాగానే బదిలీ



బాపట్ల, చీరాల సముద్ర తీరంలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలోని చీరాల తీరప్రాంతంలో అక్రమ నిర్మాణాలు మరింతగా పెరిగాయి. బాపట్లలోని సూర్యలంక, చీరాల పరిధిలోని ఓడరేవు, రామాపురం బీచ్‌లకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి నిత్యం పర్యాటకులు వస్తుంటారు. వారాంతంలో వీరి సంఖ్య లక్షల వరకు ఉంటోంది. దీంతో ఇక్కడ గెస్ట్‌హౌస్‌లు, రిసార్ట్‌లకు డిమాండ్ పెరిగింది. ఇదే అవకాశంగా స్థానికులతోపాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, సినీ ప్రముఖులు సైతం తీరంలో స్థలాలు కొని రిసార్ట్‌ల నిర్మాణానికి పూనుకొన్నారు.

ఆకాశాన్నంటేలా భూముల ధరలు

గతంలో తీరంలో ఎకరం రూ. 20 లక్షల నుంచి రూ.30 లక్షలలోపు ఉండేది. నేడు రూ. 3 కోట్ల వరకు పలుకుతోంది. ఇదే అవకాశంగా ఇక్కడ అధికంగా ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములను స్థానిక పచ్చ నేతలు, కొందరు అధికారులు కలిసి అమ్మకానికి పెట్టి రూ. రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. వేటపాలెం మండలం రామాపురం, కటారివారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం తదితర గ్రామాల పరిధిలోని తీరప్రాంతంలో వారు స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. మరికొంత ఈ భూములు పక్కనున్న ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఆక్రమించి రిసార్ట్‌లు, గెస్ట్‌హౌస్‌లు నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు 40కి పైగా రిసార్ట్‌లు ఉండగా, ప్రస్తుతం 35 రిసార్ట్‌ల నిర్మాణం వేగంగా సాగుతోంది.



నిబంధనలకు విరుద్ధంగా తీరం వెంబడి అక్రమ నిర్మాణాలు

పచ్చ నేతకు ఎకరానికి రూ. 20 లక్షలు

రెండు రిసార్ట్‌లకు మాత్రమే అనుమతులున్నట్లు అధికారులు చెబుతున్నారు. కొత్తగా వెలుస్తున్న వాటికి అనుమతులే లేవు. ఈ ప్రాంతానికి చెందిన పచ్చ నేత ఎకరానికి రూ. 20 లక్షలు తీసుకొని అనధికార అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. రియల్ వెంచర్లకు ఎకరానికి రూ.10 లక్షలు తీసుకుంటున్న ఆయన.. రిసార్ట్‌లకు మాత్రం రెండింతలు తీసుకుంటున్నారని తెలుస్తోంది. ఇక్కడ ఎలాంటి నిర్మాణానికైనా భూ బదలాయింపు జరగాలి. తర్వాత నిర్మాణానికి సంబంధించిన ప్లాన్‌కు పంచాయతీ అప్రూవల్ ఉండాలి. విద్యుత్ మీటర్ ఏర్పాటుకు పంచాయతీ సెక్రటరీ నుంచి నో అబ్జక్షన్ తీసుకోవాలి. ఇవేవీ లేకుండానే అధికారులకు ముడుపులు ముట్టజెప్పి రిసార్ట్‌లు నిర్మిస్తున్నారు. అక్రమ నిర్మాణాల్లో 50 శాతం అసైన్డ్ ల్యాండ్ ఉండడంతో కన్వర్షన్‌కు అవకాశం లేకుండా పోయింది.

సీఆర్‌జెడ్ నిబంధనలు గాలికి..

సీఆర్‌జెడ్ (కోస్టల్ రెగ్యులేషన్ జోన్) నిబంధనల మేరకు సముద్ర తీరానికి 500 మీటర్ల లోపు మత్స్యకార గ్రామాలు, మత్స్యకారులు, వారి ఆస్తులు, ఫిషింగ్ జెట్టీలు, ఐస్ ప్లాంట్లు, ఫిష్ డ్రైయింగ్ ప్లాట్‌ఫారాలు, పాఠశాలలు, పారిశుద్ధ్యం వంటి ఇతర వసతుల కల్పన కార్యక్రమాలు మినహా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టరాదు. ప్రధానంగా తీరంలో రిసార్ట్‌లు, గెస్ట్‌హౌస్‌లు, లాడ్జీలు, హోటళ్లు లాంటివి అసలు నిర్మించరాదు. కానీ ఇవేమీ ఇక్కడ అమలు కావడం లేదు. ఇక ఇక్కడ పనిచేస్తున్న ఒక రెవెన్యూ అధికారి గతంలో తాను పనిచేసిన మండలం నుంచి కొందరు పంచాయతీ సెక్రటరీలు, ఇతర రెవెన్యూ సిబ్బంది ద్వారా అక్రమాలకు పాల్పడుతున్నారు. చీరాల ఆర్డీవోగా ఉన్న సూర్యనారాయణరెడ్డి ఎన్నికల ముందు ఇక్కడి అక్రమాలపై విచారణ చేపట్టారు. పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేశారు. అప్పటి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అక్రమ నిర్మాణదారులకు నోటీసులు కూడా జారీ అయ్యాయి. కూటమి అధికారంలోకి రావడంతో ఆ ఆర్డీవోను పచ్చ నేత బదిలీ చేయించారు. తర్వాత వచ్చిన ఆర్డీవో చంద్రశేఖర నాయుడు ఒక అక్రమ నిర్మాణాన్ని తొలగించి, మిగిలిన వారికి నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది. పచ్చ నేత ద్వారా ఆర్డీవోపై ఒత్తిడి రావడంతో ఆక్రమణల తొలగింపు వ్యవహారం తాత్కాలికంగా వాయిదా పడినట్లు సమాచారం.



తీరంలోని అసైన్డ్ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు

ఇంద్రకీలాద్రిపై భక్తుల సందడి



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ అధికంగా కనిపించింది. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు పలు అర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ఉదయం 6 గంటల నుంచి ప్రారంభమైన రద్దీ మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు కొనసాగింది. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గంలో కొండపైకి చేరుకున్నారు. రూ. 500, రూ.300, రూ.100 టికెట్‌తోపాటు సర్వ దర్శనం క్యూలైన్‌లో భక్తుల రద్దీ కనిపించింది. సర్వ దర్శనానికి రెండు గంటలకుపైగా సమయం పట్టింది.

అర్జిత సేవల్లో ఉభయదాతలు

తెల్లవారుజామున ప్రధాన ఆలయంలో అమ్మవారి మూలవిరాట్ వద్ద నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీచక్రనవార్చన, లక్ష కుంకుమార్చన, యాగశాలలో నిర్వహించిన చండీ హోమం, శాంతి కల్యాణంలో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలను ప్రత్యేక క్యూలైనులో అమ్మవారి దర్శనానికి అనుమతించారు. రూ. 500 టికెటు కొనుగోలు చేసిన భక్తులతోపాటు వీఐపీలు, సిఫార్సు లేఖలపై వచ్చిన భక్తులకు అంతరాలయ దర్శనం కల్పించారు. అంతరాలయానికి రద్దీ తగ్గుముఖం పట్టిన కొంత సమయం తర్వాత రూ.300 క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులకు ముఖ మండప దర్శనానికి అనుమతించారు. భక్తులకు అమ్మవారి బంగారు వాకిలి దర్శనం కల్పించడంతో త్వరితగతిన దర్శన భాగ్యం కలిగింది.

ఇబ్బంది కలుగకుండా చర్యలు

రద్దీ ఎక్కువైన నేపథ్యంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏఈవో చంద్రశేఖర్ సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు. భక్తులకు మంచినీటిని సరఫరా చేయించారు. అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం అమ్మవారి పంచ హారతుల సేవ, పల్లకీ సేవలోనూ భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బగళాముఖి సేవలో న్యాయమూర్తులు



చందోలు(కర్లపాలెం): చందోలు బగళాముఖి అమ్మ వారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గుణరంజన్ సతీమణి విజిత, కుమారుడు గిరీష్, కుమార్తె గ్రీష్మ, రైల్వే కోర్టు జడ్జి పి.రమాదేవి, నూజివీడు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావులు వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి, అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశేషాలను వివరించారు. అనంతరం వారు కానుకలు సమర్పించుకున్నారు. అమ్మవారి చిత్రపటాలను, ప్రసాదాలను వారికి ఈవో అందజేశారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



తాడికొండ: వెలగపూడి సచివాలయంలో ఈ నెల 30న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పీ–4 కార్యక్రమం ప్రారంభోత్సవంలో పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్లను గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదివారం పరిశీలించారు. సభా ప్రాంగణాన్ని చూసి, పలు సూచనలు చేశారు. అంతకు ముందు రాష్ట్ర సచివాలయంలో మార్చి 25, 26వ తేదీలలో రెండు రోజుల పాటు జరిగే కలెక్టర్ల సమావేశానికి సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆమె వెంట ప్రొటోకాల్ డైరెక్టర్ మోహరావు, జెడ్పీ సీఈఓ జ్యోతి బసు, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, పౌర సరఫరాల అధికారి కోమలి పద్మ, జిల్లా ఉపాధి కల్పనాధికారి దుర్గాబాయి, గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, తుళ్ళూరు తహసీల్దార్ సుజాత తదితర అధికారులు పాల్గొన్నారు.

వయోజన విద్య, రాత్రి బడి పరిశీలన



తాడికొండ: తాడికొండ మండలంలో కొనసాగుతున్న వయోజన విద్య, రాత్రి బడి కేంద్రాలను ఆదివారం ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. మండలంలోని నాలుగు కేంద్రాలను పరిశీలించిన వారు వయోజన విద్య, రాత్రి బడి కార్యక్రమం జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. మండలంలో 50 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 510 మంది చదువుకుంటున్నారని నిర్వాహకులు తెలిపారు. ఉల్లాస్ వయోజన విద్య ద్వారా డ్వాక్రా సంఘాల మహిళలకు నేర్చుకున్న అక్షరాలు, విద్యపై పరీక్ష నిర్వహించారు. వాటిని కేంద్ర బృందం సభ్యులు పరిశీలించి, హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర అడల్ట్ ఎడ్యుకేషన్ బ్యూరో కన్సల్టెంట్ అధికారి జగన్ మోహన్ రావు, సభ్యులు ఓంకారం, శిరీష, దాసరి వెంకటస్వామి ఎంపీడీవో కె.సమతా వాణి, ఏపీఎం సాంబశివరావు, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎద్దు వాగుపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

రాజుపాలెం: మండలంలోని మొక్కపాడు గ్రామ సమీపాన ఎద్దువాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ఆదివారం రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. వంతెనను రూ.5.66 కోట్లతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు దుర్గేష్‌రావు, ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, కూటమి నేతలు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి క్షీరపురి తలంబ్రాలు



భద్రాద్రి ఆలయానికి తలంబ్రాలను అందిస్తున్న బాలకేశవులు దంపతులు (ఫైల్)

భద్రాద్రి ఆలయానికి చీరాలలో సిద్ధం

చీరాల: భద్రాద్రి సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రుని కల్యాణమంటేనే రెండు తెలుగు రాష్ట్రాలు వేయి కళ్లతో ఎదురు చూస్తుంటాయి. ఆ వేడుకలో వినియోగించే తలంబ్రాలను గోటితో వొలిచే అవకాశం చీరాల వాసులకు ఏళ్లుగా దక్కుతోంది. శ్రీశైలం మల్లన్న కల్యాణానికి చీరాల చేనేతలే తలపాగా తయారు చేసి లింగోద్భవ సమయాన చుట్టే అదృష్టం కూడా దక్కింది. భద్రాద్రి తలంబ్రాలు మహాసంకల్పానికి పూనుకున్న చీరాలకు చెందిన సిద్ధాంతి పి.బాలకేశవులు, మరికొందరు నియమనిష్ఠలతో ఈ దైవకార్యాన్ని నిర్వహిస్తున్నారు.

అలా వచ్చింది అవకాశం..

చీరాలలో శ్రీ రఘురామ భక్తసేవా సమితి 2011లో 11 మందితో ఏర్పాటైంది. సమితి ఆధ్వర్యంలో పండుగలకు, ఆధ్యాత్మిక కార్యక్రమాల సమయంలో వేదపారాయణలు, అన్నదానాలను నిర్వహిస్తున్నారు. 2016లో తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చి, చీరాలలో ఏకాంత సేవ ఘనంగా నిర్వహించారు. దీంతో వీరికి భద్రాద్రి రామయ్య కల్యాణోత్సవానికి తలంబ్రాలు అందించే అవకాశం వచ్చింది. బాలకేశవులుకు ఉన్న రెండు ఎకరాలలో పండిన ధాన్యంతో తలంబ్రాలు తయారు చేయిస్తున్నారు. విజయదశమి నుంచి ఉగాది వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

దేశ, విదేశాలలోనూ క్రతువు...

ఈ తలంబ్రాలను తయారు చేసే క్రతువులో దేశ, విదేశాలలో ఉన్న తెలుగు వారిని కూడా భాగస్వాములు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ, తమిళనాడు, ఒడిశా, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, కేరళ భక్తులు భాగస్వాములు అయ్యారు. కమిటీ ప్రతినిధులు వాట్సప్ గ్రూపులు ప్రారంభించారు. భక్తులు వాటిలో చేరడంతో పర్యవేక్షకుల ద్వారా ఆయా ప్రాంతాల వారికి ధాన్యం ఇచ్చారు. ఈ ఏడాది కల్యాణానికి అవసరమైన 25 వేల కేజీల తలంబ్రాలను పంపనున్నారు.



తలంబ్రాలు సిద్ధం చేస్తున్న మహిళలు

పూర్వజన్మ సుకృతం: పొత్తూరి బాలకేశవులు

భద్రాద్రి రాములోరి కల్యాణానికి ఉపయోగించే తలంబ్రాలను అందించే అవకాశం రావడం పూర్వజన్మఫలమే. వాస్తవానికి అక్కడి వారే ఇవి తయారు చేస్తారు. అయితే మేమంతా కలిసి తలంబ్రాలు తయారు చేసిన విధానంపై దేవస్థాన అధికారులు, ధర్మకర్తలు సంతృప్తి చెంది అవకాశం కల్పించారు. దానిని సద్వినియోగం చేసుకుని వరుసగా ఈ క్రతువును మూడు సంవత్సరాలుగా కొనసాగిస్తున్నాం.

1న పర్చూరులో సీఎం పింఛన్ల పంపిణీ



బాపట్ల: ఏప్రిల్ ఒకటో తేదీన పర్చూరు నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్నట్లు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. ఆదివారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. పర్చూరు నియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి 'పేదల సేవలో' అని నామకరణం జరిగినట్లు తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులతో కార్యక్రమం గురించి చర్చించినట్లు పేర్కొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారికి కలెక్టర్ పలు సూచనలు చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, సీపీఓ శ్రీనివాసరావు, డీపీఓ ప్రభాకర్, డ్వామా పీడీ విజయలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ పద్మ, బాపట్ల డీఎల్‌డీవో విజయలక్ష్మి, బాపట్ల, చీరాల, రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ సంఘ జిల్లా అధ్యక్షుడిగా కోటయ్య



నెహ్రూ నగర్(గుంటూరు ఈస్ట్): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా మార్పు కోటయ్య ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని రెవెన్యూ కల్యాణమండపంలో అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షులుగా మైల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా జి.కొండలరావు, కె.రజని, జనరల్ సెక్రెటరీగా ఎం.లక్ష్మణరావు, జాయింట్ సెక్రెటరీగా ఆర్.కోటేశ్వరరావు, పాతపాటి రమేష్, ట్రెజరర్‌గా సి.హెచ్.అనూష, ప్రెస్ సెక్రటరీగా ఎం. కోటేశ్వరరావు, పి.రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సి.హెచ్.ఆంజనేయులు, ఎస్.రవిశంకర్, కోటి శ్రీనివాసరావు, జె.విమలను ఎన్నుకున్నట్లు వివరించారు. కొత్తగా ఎన్నికైన కమిటీని ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ కుమారి అభినందించారు.

న్యాయవాదుల డెత్ బెనిఫిట్స్ రూ.6 లక్షలకు పెంపు

గుంటూరు లీగల్: న్యాయవాదుల డెత్ బెనిఫిట్స్ రూ.5 లక్షల నుంచి రూ. 6 లక్షలకు పెంచుతూ ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ నిర్ణయించింది. గతంలో న్యాయవాదులు అనారోగ్యానికి గురైనప్పుడు రూ.లక్ష ఉన్న మెడికల్ బెనిఫిట్స్ రూ.1.50 లక్షలకు పెంచుతున్నట్లు తీర్మానించింది. ఇది ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తుందని పేర్కొంది. యాక్సిడెంట్ డెత్ జరిగితే బార్ కౌన్సిల్ వెల్ఫేర్ ఫండ్‌తో సంబంధం లేకుండా రూ.5 లక్షలు ఇచ్చే విధంగా తీర్మానించింది. ఇది మే 1 నుంచి అమలులోకి వస్తున్నట్లు వెల్లడించింది.

ముస్లింలను వంచించిన కూటమి ప్రభుత్వం


షేక్ బాజీ

నాదెండ్ల: ముస్లింలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు కూటమి ప్రభుత్వం మద్దతునివ్వడం అన్యాయమని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీరని ద్రోహం చేశారని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లిం ఓటు బ్యాంకుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు మాయమాటలు చెప్పి మోసం చేసిందని విమర్శించారు. వక్ఫ్ బిల్లుకు ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, నితీష్‌కుమార్ మద్దతు తెలిపారని కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు బహిరంగ ప్రకటన చేయడం ముస్లింలపై వారికున్న కపట ప్రేమను తేటతెల్లం చేసిందని తెలిపారు. ముస్లింలకు అండగా నిలుస్తామన్న మాటకు కట్టుబడి ఉంటే వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి బహిరంగ ప్రకటన చేయాలని షేక్ బాజీ డిమాండ్ చేశారు. వక్ఫ్ బిల్లుపై చిత్తశుద్ధి ప్రకటించకపోతే భవిష్యత్తులో ముస్లింల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

పొగాకు రైతులను ముంచిన ప్రభుత్వం

- గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న రైతన్న
- అన్నదాతలను ఆదుకోకపోతే ఉద్యమానికి సిద్ధం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాంబాబు


బాపట్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న రాంబాబు

బాపట్ల: పొగాకు రైతులను రాష్ట్ర ప్రభుత్వం నట్టేట ముంచేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పలెపోగు రాంబాబు ధ్వజమెత్తారు. పొగాకుకు తగిన ధర లేనప్పుడు వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగా రూ.200 కోట్లను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించి మార్క్‌ఫెడ్‌తో కొనుగోలు చేయించారని గుర్తుచేశారు. రైతులను ఆదుకున్నారని రాంబాబు పేర్కొన్నారు. బాపట్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ.. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టిన రైతులు కనీస మద్దతు ధర కూడా రాకపోవటంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. పొగాకు బోర్డులు మద్దతు ధర లభించేలా చూడటంలో నిర్లక్ష్యంగా ఉన్నాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు క్వింటా రూ. పది వేలు పలకగా.. ఇప్పుడు రూ. నాలుగు వేలకైనా అడిగేవారే లేరన్నారు. బర్లీ పొగాకుకు అమెరికా, బ్రిటన్ వంటి ప్రాంతాల్లో డిమాండ్ ఉన్నప్పటికీ ఆ అవకాశాన్ని అందిపుచ్చుకొనే పరిస్థితి లేదన్నారు. గిట్టుబాటు ధర కల్పించకుంటే ఆందోళనకు దిగుతామని రాంబాబు హెచ్చరించారు. రైతులతో కలిసి వెల్లంపల్లిలోని పొగాకు బోర్డు వద్ద ఆందోళనకు సిద్ధమవుతున్నామని తెలిపారు.

భారీగా పెరిగిన ఖర్చులు

వైఎస్సార్‌సీపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఈద శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పొగాకు సాగుకు ఖర్చులు పెరిగాయని, గిట్టుబాటు ధర మాత్రం లేకపోవటంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని పేర్కొన్నారు. పొగాకు చెక్కు గిడ్డంగుల్లో పెట్టుకున్నందుకు గతంలో రూ.400 ఉంటే ఇప్పుడు రూ.720 వసూలు చేస్తున్నారని చెప్పారు. శనగ, మిర్చి రైతులకు కూడా గిట్టుబాటు ధర కల్పించటంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు కొండలరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, యువత జిల్లా అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గవిని శ్రీనివాసరావు, నాయకులు జోగి రాజా, నర్రావుల వెంకట్రావు, తన్నీరు అంకమ్మరావు, కటికల యోహోషువా తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా ట్రాన్స్‌ఫ్యూజన్ సెంటర్ నిర్మాణం

- సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడు డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడి
- ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో నూతన కార్యాలయం ఏర్పాటు


సమావేశంలో డాక్టర్ సృజనను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు, కమిటీ సభ్యులు

నరసరావుపేట: పల్నాడు జిల్లాకు రెడ్‌క్రాస్ ద్వారా తలసేమియా ట్రాన్స్‌ఫ్యూజన్ సెంటర్ మంజూరైందని, త్వరలో ప్రారంభిస్తామని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పుట్టుకతో వచ్చే తలసేమియా, హిమోఫీలియా జబ్బులున్న వారికి ప్రతినెలా ఉచితంగా రక్తాన్ని అందజేస్తామని చెప్పారు. శనివారం సాయంత్రం పట్టణంలోని సమావేశపు హాలులో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. 'మీ డాక్టర్ మీ ఇంటికి' అనే ప్రాజెక్టు మంజూరైందని, దీనిని త్వరలో ప్రారంభించి జిల్లాలో గిరిజన తండాలు, మత్స్యకారుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్యాన్ని అందజేస్తామని వెల్లడించారు. ఆర్డీవో ఆఫీస్ కాంపౌండ్‌లో ఉన్న 15 సెంట్లు రెడ్‌క్రాస్ స్థలంలో నూతన భవన నిర్మాణం చేపట్టబోతున్నామని చెప్పారు. ఇందులో ఓల్డ్‌ఏజ్ హోం, స్కిల్ డెవలప్‌మెంటు ట్రైనింగ్ సెంటర్, ఉచిత వైద్యశాల, అనాథ శరణాలయం, జనరిక్ మెడికల్ షాప్‌లను ప్రారంభిస్తామని వెల్లడించారు. రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌కు ప్రస్తుత వేసవిలో రక్తకొరత ఏర్పడవచ్చని, రక్తదానం శిబిరాలను ఏర్పాటు చేసేవారు, సంస్థ ద్వారా ప్రథమ చికిత్స శిక్షణను పొందదల్చినవారు, మెంబర్లుగా చేరేవారు 91000 78576 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు. వైస్ చైర్మన్ పీవీఎం శరత్‌బాబు, కోశాధికారి గంద్రకోట మురళీకృష్ణ ప్రసంగిస్తూ జిల్లా రెడ్‌క్రాస్ ఏర్పడిన నాటి నుంచి నో సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. బ్లడ్ బ్యాంక్ నిర్మాణం కోసం విరాళాలు అందించిన దాతలు, సేవలు అందించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. మేనేజింగ్ కమిటీ సభ్యులైన శ్రీనివాస గుప్తా, డాక్టర్ సృజన, వీరారెడ్డిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మేనేజింగ్ కమిటీ సభ్యులు సాంబశివరావు, జీవీఎస్ రాము, డాక్టర్ రహమతుల్లా, మాజీ కౌన్సిలర్ మస్తాన్‌వలి, జీవితకాల సభ్యులు మేళం శ్రీకృష్ణ, హనుమంత ప్రసాద్, కాసు దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

లవ్ యువర్ ఫాదర్ చిత్ర బృందం సందడి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు నగరంలో లవ్ యువర్ ఫాదర్ (ఎల్‌వైఎఫ్) చిత్ర బందం సందడి చేసింది. వచ్చేనెల 4న ఎల్‌వైఎఫ్ చిత్రం విడుదలకానుంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం బందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి చిత్ర హీరో శ్రీహర్ష, నటులు బంటి, శ్రీకర్, నిర్మాత కిషోర్‌రాఠీ బృందం చేరుకున్నారు. తొలుత శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నటుడు శ్రీహర్షను ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య సత్కరించి, చిత్ర బందానికి తీర్థ ప్రసాదాలను అందించారు. చిత్ర హీరో శ్రీహర్ష మాట్లాడుతూ ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని చెప్పారు. ఇందులో తండ్రి కొడుకు మధ్య సన్నివేశాలు ప్రతి ఒక్కరినీ అలరిస్తాయని చెప్పారు. వచ్చేనెల 4న విడుదలవుతున్న ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ థియేటర్లల్లో వీక్షించాలని కోరారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ చిత్ర టైటిల్ లవ్ యువర్ ఫాదర్ చాలా బాగుందని అన్నారు. వైఎస్ఆర్‌సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పార్లమెంట్ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ ఫాదర్స్ డే రోజునే కాకుండా తండ్రిని ప్రతినిత్యం ప్రేమించాలని అన్నారు. ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర, భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకష్ణలు నటుడు శ్రీహర్షను అభినందించారు. టీడీపీ నాయకులు మల్లి, చిత్ర నిర్మాతలు కిషోర్ రాఠీ, రామస్వామిరెడ్డి, నాయకులు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎం.రామకష్ణారెడ్డి పాల్గొనగా అనంతరం చిత్రబృందం బస్సు యాత్ర ప్రారంభించింది.

ఏఎఫ్‌డబ్ల్యూఎల్ ఉపాధ్యక్షురాలిగా ఝాన్సీ


సోమసాని ఝాన్సీ

గుంటూరు లీగల్: ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ (ఏఎఫ్‌డబ్ల్యూఎల్) దక్షిణభారత ఉపాధ్యక్షురాలిగా సోమసాని ఝాన్సీ ఎన్నికయ్యారు. బెంగళూరులో ఈనెల 23న నిర్వహించిన ఎన్నికల్లో సమీప ప్రత్యర్థి తెలంగాణకు చెందిన పి.రేవతి దేవిపై 31 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ సందర్భంగా గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు పోలూరు వెంకటరెడ్డి, సిడి భగవాన్, ఒట్టి జొన్నల బ్రహ్మారెడ్డి, కాసు వెంకట్రెడ్డి, కళ్ళం రమణారెడ్డి, కృష్ణారెడ్డి, పలువురు న్యాయవాదులు ఝాన్సీకి అభినందనలు తెలిపారు. ఝాన్సీ గుంటూరు బార్ అసోసియేషన్ సభ్యురాలు కావడం విశేషం. ఇదిలా ఉంటే ఈ ఎన్నికల్లో అధ్యక్షురాలిగా కె.శాంతకుమారి(తమిళనాడు) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఝాన్సీ లక్ష్మికి ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ లాయర్స్ ఫౌండర్ ప్రెసిడెంట్ భాస్కర లక్ష్మీ, ప్రెసిడెంట్ అరుణ, ఈసీ సభ్యులు, గుంటూరు బార్ అసోసియేషన్ పూర్వ ప్రెసిడెంట్ పోలూరి వెంకట రెడ్డి, ప్రస్తుత ప్రెసిడెంట్ కాసు వెంకట రెడ్డి, బార్ కౌన్సిల్ మెంబెర్ బ్రహ్మానంద రెడ్డి, పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

ఝాన్సీ ప్రస్థానమిలా..

ఝాన్సీలక్ష్మి 2000 నుంచి న్యాయవాదిగా గుంటూరు జిల్లా కోర్ట్, హైకోర్ట్, రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్లో పనిచేస్తున్నారు. సోమసాని బ్రహ్మానంద రెడ్డి వద్ద జూనియర్ గా పనిచేశారు. ఆమె ఆర్డీఓ ట్రిబ్యునల్ ప్యానెల్ అడ్వకేట్‌గా, రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్, అమరావతి సెంట్రల్ గవర్నమెంట్ స్టాండింగ్ కౌన్సిల్‌గా, స్టాండింగ్ కౌన్సెల్ కం స్పెషల్ పీపీసీసీఆర్ సెల్, సీఐ. డీగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఆమె ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ లాయర్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సెక్రటరీగా కూడా కొనసాగుతున్నారు.

ట్రెక్కింగ్ అంటే ఆసక్తి

ఝాన్సీ లక్ష్మికి ట్రెక్కింగ్ అంటే ఆసక్తి 2024 జూన్‌లో 53 ఏళ్ల వయస్సులో ఎవరెస్ట్ బేస్ క్యాంపు ట్రెక్కింగ్ కూడా చేశారు.

నేడు ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చల్లగుండ్లలోని రాజీవ్‌గాంధీ మెమోరియల్ ఎయిడెడ్ విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థులకు సోమవారం కంప్యూటర్ ఆధారిత టెస్ట్ (సీబీటీ) నిర్వహిస్తున్నట్లు గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ బయాలాజికల్ సైన్స్, మ్యాథ్స్, భాషా పండిట్ తెలుగు, హిందీ పోస్టుల వారీగా దరఖాస్తు చేసుకుని, ఇప్పటికీ హాల్ టిక్కెట్లు పొందని అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, గుంటూరు శివారు నల్లపాడులోని టీసీఎస్ అయాన్ డిజిటల్ జోన్ పరీక్షా కేంద్రానికి కేటాయించిన షిఫ్ట్ వారీగా పరీక్ష సమయానికి గంటన్నర ముందుగా చేరుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు మూడు షిఫ్ట్‌లలో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.

పొగాకు కొనుగోలుకు చర్యలు తీసుకోవాలి

ఇంకొల్లు(చినగంజాం): ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాలలో నల్లబర్లీ పొగాకు సాగు విస్తృతంగా చేపట్టినందున ప్రభుత్వమే కొనుగోలుకు చర్యలు చేపట్టాలని బాపట్ల జిల్లా సీపీఎం కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఇంకొల్లు కో ఆపరేటివ్ బ్యాంక్ ఆవరణలో రైతుల సదస్సు నిర్వహించారు. ఆ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ.. రైతులకు తీవ్ర ఇబ్బందులు ఉన్నాయని, కొనుగోలుకు వ్యాపారులు ముందుకు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వమే పొగాకు బోర్డు పరిధిలోకి ఈ పొగాకు పంటను తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు కందిమళ్ళ రామ కోటేశ్వరరావు మాట్లాడుతూ గురువారం సచివాలయాల వద్ద రైతులు అర్జీలను సమర్పించి ధర్నా నిర్వహించాలన్నారు. జిల్లా రైతు సంఘం కార్యదర్శి తలపనేని రామారావు, పర్చూరు డివిజన్ రైతు సంఘం నాయకులు బండి శంకరయ్య పాల్గొన్నారు.

సీపీఐ నేత జేబీ శ్రీధర్ మృతి


జేబీ శ్రీధర్ (ఫైల్)

బాపట్ల: కమ్యూనిస్టు ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తున్న జేబీ శ్రీధర్ (69) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. ఆయన వినుకొండంలో జన్మించారు. సీపీఐ సానుభూతిపరులైన తల్లిదండ్రులు ఆనందరావు, మార్తమ్మల పోరాట లక్షణాలను అలవర్చుకుని విద్యార్థి దశ నుంచి ప్రజా సమస్యలపై పోరాటం చేశారు. ఐదు దశాబ్దాలపాటు వామపక్ష సిద్ధాంతాల వ్యాప్తికి ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలలో కృషి చేశారు. 12 ఏళ్లపాటు విశాలాంధ్ర జర్నలిస్టుగా పని చేశారు. బాపట్లలో జరిగిన వామపక్ష ఉద్యమాల్లో శ్రీధర్ కీలక పాత్ర పోషించారు. హృదయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నా ఉద్యమమే ఊపిరిగా జీవితం గడిపారు. శ్రీధర్ మృతిపై సీపీఐ రాష్ట్ర కార్యవర్గం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, జల్లి విల్సన్, జంగాల అజయ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ, జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తదితరులు శ్రీధర్ భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కోన రఘుపతి కూడా శ్రీధర్ కుటుంబానికి సానుభూతి తెలిపారు. బాపట్ల మాజీ ఎమ్మెల్యేలు చీరాల గోవర్ధనరెడ్డి, గాదె వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కోకి రాఘవరెడ్డి, కాగిత సుధీర్‌బాబు, జోగి రాజా, కొక్కిలిగడ్డ చెంచయ్య తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో నేత్ర సమస్యలు పరిష్కారం

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



హాస్పిటల్ ప్రారంభోత్సవం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి

గుంటూరు ఎడ్యుకేషన్: నేత్ర సంబంధ సమస్యలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కరించవచ్చని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. ఆదివారం భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో చంద్రమౌళీనగర్‌లో నెలకొల్పిన మెడెక్స్ హాస్పిటల్స్‌లో ఆధునిక నేత్ర సంరక్షణ వైద్యసేవలను ఆయన ప్రారంభించారు. పెమ్మసాని మాట్లాడుతూ భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ మెడెక్స్ హాస్పిటల్స్ ద్వారా వైద్య రంగంలో అడుగుపెట్టడం శుభపరిణామమన్నారు. ప్రముఖ గుండె మార్పిడి శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే మెడెక్స్ హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేసిన కంటి, దంత, చర్మ, సైకాలజీ వైద్య సేవల విభాగాలను సందర్శించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అందుబాటులో ఉన్న వైద్య సేవల గురించి సిబ్బంది ఆయనకు వివరించారు. భాష్యం చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ అడ్వాన్స్‌డ్ ఐ కేర్ యూనిట్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏప్రిల్ 23 వరకు మెడెక్స్ హాస్పిటల్స్‌లో ఉచిత కంటి వైద్య పరీక్షలు అందుబాటులో ఉంటాయని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొలుత వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఆస్పత్రి ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మెడెక్స్ హాస్పిటల్స్ ఐ కేర్ యూనిట్ చీఫ్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ యర్రారపు మాధవీలత, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు



గాయపడిన దంపతులు

జె.పంగులూరు: రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలైన సంఘటన మండల పరిధిలోని అలవలపాడు గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు.. తిమ్మసముద్రం గ్రామానికి చెందిన దంపతులు తేళ్ళ యోహోషువా, ఏసురత్నం ఆదివారం తిమ్మసముద్రం గ్రామంలో బంధువుల అంత్యక్రియలకు బైకుపై బయలుదేరారు. జాతీయ రహదారి నుంచి అలవలపాడు వైపు తిరిగాక గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

తాడేపల్లి రూరల్: ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆదివారం కుంచనపల్లిలో జరిగింది. బంధువుల కథనం ప్రకారం.. కుంచనపల్లికి చెందిన నల్లపు సంజీవరావు, విజయ కుమారి దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. కుమార్తె కుక్కమల్ల సౌందర్య (26) 2022లో అదే గ్రామానికి చెందిన రాజును ప్రేమించింది. పెద్దలను ఎదిరించి ఇంట్లో నుంచి వెళ్లిపోయి పెళ్లి చేసుకుంది. అదే గ్రామంలో భర్తతో కలిసి జీవిస్తోంది. అయితే ఇటీవల సౌందర్యను రాజు, అతని కుటుంబ సభ్యులు కట్నం కోసం వేధిస్తున్నట్లు సమాచారం. శనివారం రాత్రి తన భర్త వేధిస్తున్నాడంటూ తండ్రి సంజీవరావుకు సౌందర్య ఫోన్ చేసింది. ఆదివారం ఉదయం బాత్‌రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసి తండ్రి సంజీవరావు, కుమారులు ఆమె నివాసానికి వెళ్లారు. అప్పటికే సౌందర్యను ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడకు వెళ్లగా సౌందర్య మృతి చెందిందని వైద్యులు తెలిపారు. భర్త, అతని తరపు కుటుంబ సభ్యుల వేధింపుల వల్ల తన కుమార్తె అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందని సంజీవరావు విలపించారు. ఆయన ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



పిడుగురాళ్ల: వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని తుమ్మలచెరువు గ్రామం వద్ద ఆదివారం జరిగింది. వాహనం ఆచూకీ తెలియలేదు. మృతుడి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుంది. స్థానికులు సమాచారం మేరకు 108 సిబ్బంది నర్సరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఒంటిపై పచ్చ రంగు గీతల చొక్కా ధరించి ఉన్నాడు. మృతుడికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే సంప్రదించాలని పిడుగురాళ్ల పోలీసులు తెలిపారు.

కార్యకర్తలందరికీ వైఎస్సార్ సీపీ అండ

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరికీ అండగా ఉంటుందని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పల్నాడు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న అంజిరెడ్డిపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బక్కిరెడ్డిని ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. టీడీపీ మూకలు దాడి చేయడం దుర్మార్గమని, ఇటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడితే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. అధికారం శాశ్వతం కాదని, గెలుపు, ఓటములు సహజమని పేర్కొన్నారు. రేపు అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనేనని, అది గుర్తుపెట్టుకొని టీడీపీ నాయకులు వ్యవహరించాలని తెలిపారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఆయన వెంట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వైద్యులు విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, పట్టణ, మండల కన్వీనర్లు చింతా వెంకట రామారావు, చల్లా పిచ్చిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లు పిచ్చిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరభద్రుని రామిరెడ్డి, కత్తెరపు రామ్‌గోపాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ కన్వీనర్ కాలే మాణిక్యరావు, పట్టణ యూత్ అధ్యక్షులు మందా సుధీర్, వైస్ ఎంపీపీ సాతులూరి బాబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చింతా సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

దేశ అభివృద్ధిలో యూబీఐ కీలకపాత్ర

కొరిటెపాడు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శతాబ్దంపైగా లక్షలాది మంది ఉద్యోగుల సహకారంతో దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని ఆ బ్యాంక్ జోనల్ హెడ్ సయ్యద్ జవహర్ చెప్పారు. ఆదివారం తాలూకా కార్యాలయ ఆవరణలోని పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఏపీ, తెలంగాణ యూనియన్ బ్యాంక్ పెన్షనర్స్ అండ్ రిటైరీస్ అసోసియేషన్ ఆవిర్భావ సభ, తొలి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జోనల్ హెడ్ జవహర్ మాట్లాడుతూ ఏ సంస్థ ఐనా ఉద్యోగుల సహాయ సహకారాలు లేకపోతే రాణించలేదని పేర్కొన్నారు. అధ్యక్షత వహించిన అసోసియేషన్ అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల సమస్యలపై యాజమాన్యాలు, ప్రభుత్వాలు చిన్నచూపు ప్రదర్శించడం బాధాకరమని అన్నారు. విశ్రాంతి జీఎం, విశ్రాంత డీజీఎంలు డి.చిరంజీవి, పుల్లారావు, ఏపీఎస్ కృష్ణమోహన్, కేజే.శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు.

సమాజాభివృద్ధికి హేతుబద్ధ ఆలోచనలు దోహదం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హేతువాద సంఘం ప్రతినిధులు

- ఘనంగా జిల్లా హేతువాద సంఘం ద్వితీయ మహాసభలు
- జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

నరసరావుపేట ఈస్ట్: సమాజాభివృద్ధికి హేతుబద్ధ ఆలోచనలు, ఆచరణలు దోహదపడతాయని వక్తలు స్పష్టం చేశారు. హేతువాద సంఘం కార్యాలయంలో ఆదివారం పల్నాడు జిల్లా సంఘం ద్వితీయ మహాసభలు నిర్వహించారు. మతం–సైన్స్ అంశంపై ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం అధ్యక్షుడు కరణం రవీంద్రబాబు మాట్లాడారు. మనుషుల్లో ఆలోచనా శక్తిని మతాలు ముందుకు సాగనీయవని తెలిపారు. మతాలు విశ్వాసాలతో ముడిపడి ఉండగా, సైన్స్ సత్యాన్వేషణ చేస్తుందని స్పష్టం చేశారు. హేతుబద్ధంగా మాట్లాడినందుకు కోపర్నికస్, గెలీలియో, బ్రూనో వంటి వారిని మతపెద్దలు వేధింపులకు గురి చేశారని తెలిపారు. విశ్వ తత్వం–జీవతత్వం అంశంపై భారత హేతువాద సంఘం ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ మాట్లాడారు. విశ్వానికి ఆది, అంతాలు లేవని స్పష్టం చేశారు. మానవుడు సహజ సహేతుకంగా ఆలోచించే జీవి కావడంతో ఇంతటి అభివృద్ధిని సాధించాడని వివరించారు. సాయంత్రం నిర్వహించిన అధ్యయన తరగతుల్లో నిత్యజీవితంలో హేతువాదం అంశంపై ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ దరియావలి మాట్లాడారు. మూఢ విశ్వాసాలను ప్రశ్నించాలని తెలిపారు. డాక్టర్ గుమ్మా రచించిన హేతువాద, మానవతావాద తత్వవేత్త రావిపూడి వెంకటాద్రి గ్రంథాన్ని ఈదర గోపీచంద్ ఆవిష్కరించగా, రవీంద్రబాబు సమీక్షించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఈ సందర్భంగా జిల్లా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బి.పి.వి. సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శిగా కట్టా సుబ్బారావు, ఉపాధ్యక్షునిగా వి.ఎస్.ఎస్. మూర్తి, సహాయ కార్యదర్శిగా షేక్ చినమస్తాన్, కోశాధికారిగా ఈదర గోపీచంద్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నిరాధార వార్తలు పోస్టు చేస్తే కఠిన చర్యలు

సౌత్ డీఎస్పీ భానోదయ


సౌత్ డీఎస్పీ ఏ భానోదయ

గుంటూరు రూరల్: సామాజిక మాధ్యమాల్లో నిరాధార వార్తలను పోస్టు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీ ఎ. భానోదయ తెలిపారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో డీఎస్పీ మాట్లాడారు. ప్రజా రిపోర్టర్ అనే వాట్సాప్ గ్రూప్‌లో 96401 28296 అనే ఫోన్ నంబర్ కలిగిన వ్యక్తి గుంటూరు పోలీసుల అదుపులో దళిత జర్నలిస్టు? మూడు రోజులైనా ఇంకా కోర్టులో ప్రవేశపెట్టలేదని పోస్టును వైరల్ చేసినట్టు వివరించారు. వాస్తవానికి దళిత జర్నలిస్టులెవరినీ అరెస్టు చేయలేదని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమ మద్యం తెచ్చి విక్రయిస్తున్న కేసులో మార్చి 22న తెల్లవారుజామున కూరపాటి విజయ్‌ను అరెస్టు చేసి, అదే రోజు మధ్యాహ్నం న్యాయస్థానంలో ప్రవేశపెట్టామని చెప్పారు. అతనికి న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు వెల్లడించారు. వాస్తవ దూర పోస్టును పెట్టిన వ్యక్తిపై కచ్చితంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.